ప్రజా పాలనలో పారదర్శకతే ప్రామాణికం

- రైతుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి - రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో పారదర్శకతే అత్యంత ప్రామాణికమని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ గౌరవమైన పాలన అందించాలన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అభివృద్ధిపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృ ద్ధిపై కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన జిల్లా ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్నలతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాటాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించి ప్రభుత్వ సంస్థలపై నమ్మకం కలిగేలా అధికారుల చర్యలు ఉండాలన్నారు. అధికారులు ప్రజలను గౌరవిస్తూనే వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇందిర మ్మ పాలన అందించాలనే కృత నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలో రైతులందరికి సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు భూసేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులు, భూములను కాపాడేందుకు ప్రత్యేక చొరవ చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ధరణి సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల వివరాలను ప్రతీ గ్రామంలో గుర్తించి పరిష్కరించాలన్నారు. ఇక నుంచి ప్రతీ రెండు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం ఉంటుందని మంత్రి తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కె.సీతారామారావు, చీర్ల శ్రీనివాసులు, జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

హద్దు మీరుతున్నారు



- భూమి విలువ పెరగడంతో గ్రామాల్లో గెట్ల పంచాయితీలు
- గొడవలు, హత్యలకు దారితీస్తున్న వివాదాలు
- పోలీసులకు వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతం భూ వివాదాలే
- సర్వే ఆలస్యంతో ఇబ్బంది.. ఉమ్మడి జిల్లాలో సర్వేయర్ల కొరత
- ఎల్ఆర్‌యూపీ తర్వాత కూడా పెరిగిపోయిన పంచాయితీలు
- భూ సమగ్ర సర్వే చేపడితేనే హద్దు గొడవలు తొలిగే అవకాశం

మహబూబ్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):భూముల ధరలు అడ్డగోలుగా పెరిగాయి.. వాటితోపాటే భూ వివాదాలు పెరిగిపోతున్నాయి. హద్దు పంచాయితీలు ముదిరి హత్యలు కూడా జరుగుతున్నాయి. రోజూ తహసీల్దార్ కార్యాలయాల వద్ద, రచ్చకట్టల వద్ద, పోలీస్ స్టేషన్ల ఆవరణల్లో మొత్తం గెట్ల పంచాయితీలే జరుగుతున్నాయి. ఒక్కో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతానికి పైగా భూవివాదాలకు సంబంధించినవే ఉన్నాయంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్లాట్ల ధరల కంటే వ్యవసాయ భూములకు అధికంగా డిమాండ్ ఉంది. ధరణి వచ్చే ముందు చేసిన భూరికార్డుల నవీకరణ(ఎల్ఆర్‌యూపీ) సమయంలో అనేక తప్పులు దొర్లడం కూడా గొడవలకు కారణమవుతోంది. ఆ సమయంలో ప్రైవేటుగా ఆపరేటర్లను నియమించుకుని.. వాటిని ఆన్‌లైన్ చేయడంతో.. ఒకరి భూమి ఒకరికి వెళ్లడం, పేర్లు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణం తక్కువగా చూపించడం, ఒక్కో సర్వే నంబర్లలో ఆర్ఎస్ఆర్ కంటే విస్తీర్ణం పెంచి కొత్త వ్యక్తుల పేర్లు నమోదు చేయడం వంటివి అనేకం జరిగాయి. ఆ తర్వాత బాధితులు ఫిర్యాదు చేసినా కొంత మంది అధికారులు పట్టించుకోకపోవడంతో నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు పరిష్కరిస్తున్నప్పటికీ.. బాధితులు వస్తూనే ఉన్నారు. అన్నింటి కంటే మించి.. భూముల ధరలు పెరగడం, భాగ పరిష్కారాల సమస్యలు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, ధరణిలో అన్నదమ్ముల భూముల్లో విస్తీర్ణాల్లో తేడాలు రావడం, తండ్రి తదనంతరం ఆస్తి మార్పిడి తగాదాలు, హద్దులు చెరుపుకోవడంతో మొదలవుతున్న గొడవలు అధికంగా ఉంటున్నాయి. వీఆర్‌వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దు తర్వాత గ్రామాల్లో భూ సమస్యలు ఉండవని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకోగా.. ఆ తర్వాత మరింత ఎక్కువ కావడం గమనార్హం. ప్రస్తుతం గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన వివరాలు తెలిసిన వీఆర్ఏలు, వీఆర్‌ఓలు లేకపోవడం వల్ల పరిష్కారం చాలా కష్టతరంగా మారిందని చెప్పవచ్చు. ఈ కారణంగానే భూ వివాద బాధితులు పోలీసు స్టేషన్లకు అధికంగా వస్తున్నారు.

మారిన విధానంతోనే సమస్యనా..?

ప్రస్తుతం వస్తున్న ఫిర్యాదుల్లో గెట్ల పంచాయతీలు అధికంగా ఉంటున్నాయి. భాగ పరిష్కారాల విషయంలో దాయాదుల మధ్య వివాదాలు కూడా చెలరేగుతున్నాయి. దీనికి పరిష్కారంగా అందరూ సర్వే కోసం డీడీలు చెల్లించి దరఖాస్తు చేసుకుంటున్నారు. అసలే మండలానికి ఉన్నది ఒక సర్వేయర్ కాగా.. వారు కూడా సరిగా పనిచేయకుండా ప్రైవేటు సర్వేయర్లను అసిస్టెంట్లుగా పెట్టుకుంటున్న పరిస్థితి ఉంది. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం భూములు వెతకడం, వాటిని సర్వే చేసి.. మ్యాపులు చేసి ఇవ్వడంతోనే సదరు సర్వేయర్లకు సమయం సరిపోతోంది. కానీ భూ సమస్యలు మాత్రం అడ్డగోలుగా ఉంటున్నాయి. దీనికితోడు సర్వేయర్లకు అమ్యామ్యాలు ముట్టనిదే.. పనిచేయని పరిస్థితి.. ఎటువైపు వారు ముందుగా మచ్చిక చేసుకుంటారో వారికే న్యాయం చేసే విధంగా వారి విధానాలు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో హద్దు పంచాయతీలు పెరిగి.. బాధితులు పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదిలా ఉంటే గతంలో టిపన్ (నక్షపత్రం) ద్వారా సర్వేయర్లు భూముల కొలతలు నిర్ణయించేవారు. ఎల్ఆర్‌యూపీ తర్వాత ఆ పద్ధతిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం గూగుల్ మ్యాప్స్ ఆధారంగా సర్వే చేయడం వల్ల చాలావరకు హద్దులు మారుతున్నాయి. ప్రభుత్వ సర్వేయర్లు కూడా తప్పులతడకగా రికార్డులు నిర్వహిస్తుండటంతో సమస్యలు తీవ్రంగా మారుతున్నాయి.

మచ్చుకు కొన్ని ఘటనలు..

- పాలమూరు పట్టణ పరిధిలోని చిన్నదర్పల్లిలో 1.2 ఎకరాల భూమి విషయంలో ఇరు వర్గాలు కొట్టుకోవడంతో 28 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 45 సంవత్సరాల క్రితం అటవీశాఖకు చెందిన 1.2 ఎకరాలు రేఖ్యానాయక్ పేరు మీద పట్టా అయ్యింది. ఆయనకు ముగ్గురు కొడుకులు కాగా.. వారి పిల్లలు ఈ భూమి తమకంటే తమకు చెందాలని 15 ఏళ్లుగా గొడవ పడుతున్నారు. ఈ విషయంలో గతవారం గొడవ జరగ్గా.. కళ్లలో కారంపొడి చల్లుకొని మరీ కొట్లాడుకున్నారు.
- నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం చిన్నపొర్లకు చెందిన ఎర్రకండ్ల లక్ష్మప్పకు ఇద్దరు భార్యలు.. మొదటి భార్యకు ఒక కుమారుడు, రెండో భార్యకు ఇద్దరు కుమారులు కాగా.. తనకున్న తొమ్మిది ఎకరాలు ముగ్గురికి సమానంగా పంచారు. అయితే మొదటి భార్య కొడుకు తన తల్లికి సగభాగం (4-20) రావాలని.. కొన్నాళ్లుగా వివాదం చేస్తున్నారు. ఇటీవల మొదటి భార్య మనవళ్లు భార్య వారసులపై కర్రలతో దాడిచేయగా.. సవరప్ప, తన కుమారుడు సంజీవ్ గాయపడ్డారు. సంజీవ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయంలో ఎస్ఐ సరిగా స్పందించలేదనే కారణంతో సస్పెండ్ అయ్యారు.
- జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఎమునోనిపల్లి గ్రామంలో భూ వివాదంపై ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. గ్రామానికి చెందిన వెంకటేష్ తన రెండెకరాల పొలాన్ని అక్రమంగా చదును చేస్తున్నారని పొలం దగ్గరకు వెళ్లగా ఇరువర్గాలు దాడిచేసుకున్నారు. ఈ ఘటనలో హనుమంతు, ఆంజనేయులు, కృష్ణయ్య కుంటి ఆంజనేయులు, కుంటి చిరంజీవిపై కేసు నమోదు చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లి భ్రమరాంబ చెంచు కాలనీలో ఈ నెల మూడో తేదీన చెంచు నాగన్నకు చెందిన భూమి దక్కించుకునేందుకు అదే గ్రామానికి చెందిన కొంతమంది పన్నాగం పన్నారు. చెంచు నాగన్నను చంపి పూడ్చి పెట్టారని కుటుంబ సభ్యులు కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని.. పూడ్చిన శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేశారు. ఫొరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు రావడానికి మూడు నెలల సమయం పట్టనుంది.

- అదే కాలనీలో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చెంచు ఈశ్వరమ్మపై పాశవిక దాడి ఘటన కూడా జరిగింది. చెంచు ఈశ్వరమ్మకు సంబంధించి రెండెకరాల పొలంలో బండి వెంకటేశ్వర్లుకు ఆమె భర్త ఈదన్న ఎకరం పొలం విక్రయించాడు. రూ.4.30లక్షలు చెల్లించాల్సి ఉండగా.. రూ.2లక్షలు దంపతులకు ఇచ్చాడు. మిగతా డబ్బు విడతలవారీగా ఇచ్చేశానని వెంకటేశ్వర్లు చెప్పడంతో.. ఆ డబ్బు ఏమైందని ఈశ్వరమ్మ భర్తతో గొడవపడి వెళ్లిపోవడంతో.. ఆమెను తీసుకొచ్చి నిర్బంధించి పాశవికంగా దాడి చేశారు.



మొలచింతలపల్లిలో నాగన్న మృతదేహాన్ని వెలికితీస్తున్న ప్రదేశంలో పోలీసులు, అధికారులు

పేరుకే పెద్దాసుపత్రి

- మెడికల్ కళాశాల మంజూరైనా వసతులు శూన్యం
- అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికి ఇతర ప్రాంతాలకు రెఫర్
- సమస్యలతో స్వాగతం పలుకుతున్న జిల్లా జనరల్ ఆస్పత్రి



వనపర్తి జిల్లా జనరల్ ఆస్పత్రి

వనపర్తి వైద్యవిభాగం, జూన్ 27: పేద, మధ్య తరగతి ప్రజలకు జబ్బు చేస్తే మొదటగా ప్రభుత్వ ధర్మాస్పత్రి వైపే చూస్తారు. ఇక్కడ ఉచితంగా వైద్యం, మందులు, పెద్ద డాక్టర్లు ఉంటారనే నమ్మకంతో ప్రభుత్వ ఆస్పత్రికి వస్తుంటారు. కానీ అలాంటి ప్రభుత్వ ఆస్పత్రిలో సరిపడ సౌకర్యాలు లేకపోవడం, రోగికి అందించాల్సిన వైద్యానికి సంబంధించిన పూర్తి స్థాయి వైద్యులు లేకపోవడంతో పేదలకు శాపంగా మారుతోంది. ప్రాణం మీదికి వచ్చిన రోగులు, అత్యవసర వైద్యం కోసం జిల్లా జనరల్ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. కానీ ఇక్కడ సరైన సేవలు అందుబాటులో లేకపోవడంతో మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. జనరల్‌ఆస్పత్రి సాధారణ ఆస్పత్రి సేవలకే పరిమితం కావడం దురదృష్టకరం.

రెఫర్ చేస్తున్న కేసులే అధికం

గడిచిన ఆరు నెలల్లో జిల్లా జనరల్ ఆస్పత్రి నుంచి ఏకంగా 811 కేసులు వివిధ కారణాలతో మహబూబ్‌నగర్, హైదరాబాద్ వంటి ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఈ ఏడాది జనవరిలో 145 కేసులు, ఫిబ్రవరిలో 131, మార్చిలో 155, ఏప్రిల్‌లో 143, మేలో 157, జూన్ 26వ తేదీ నాటికి 80 కేసులను ఇతర ప్రాంతాలకు రెఫర్ చేశారు.

అధికారుల తీరుపై ఆగ్రహం..

ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యుల తీరుపై ఎమ్మెల్యే కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కేసులు రెఫర్ చేయడం, మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లో జరిగిన మరణాల గురించి వివరణ కోరిన మంత్రికి వైద్యులు ఇచ్చిన సమాధానంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రథమ చికిత్సలేనా..?

వనపర్తి ఏరియా ఆస్పత్రి కాలక్రమేనా జిల్లా ఆస్పత్రిగా, తాజాగా జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ సాధించింది. దీంతో 100 పడకల ఆస్పత్రి నేడు 350 పడకల ఆస్పత్రిగా రూపాంతరం చెందింది. వనపర్తి జిల్లాగా ఏర్పడటంతో జిల్లాకు మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలు మంజూరు కావడంతో ఆస్పత్రిపై ప్రజల అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఎలాంటి రోగమైనా, ప్రాణాంతక జబ్బులైనా, ప్రమాద బాధితులైన ఎక్కడికి పోవాల్సిన అవసరం ఉండదని, ప్రతీ జబ్బుకు జనరల్ ఆస్పత్రిలోనే చికిత్స అందుతుందని భావించారు. కానీ వారి ఆశలు ఆవిరవుతున్నాయి. జిల్లా జనరల్ ఆస్పత్రిలో సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులకు వైద్యం అంతంత మాత్రమే అందుతోంది. జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజీ, న్యూరో సర్జన్, యూరాలజిస్ట్ వంటి వైద్యులు లేకపోవడంతో జనరల్ ఆస్పత్రి ప్రథమ చికిత్సలకే నిలయంగా మారుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది కొరతే ప్రధాన సమస్య

రోగులకు మెరుగైన వైద్యం అందించడం కోసం 24/7 పని చేస్తున్నాం. రెఫర్‌లు చేయడానికి ప్రధాన కారణం సరిపడ వైద్యులు లేకపోవడమే. తాను రాకముందు నుంచే ఆక్సిజన్ ప్లాంటు పనిచేయడం లేదు. ఈ విషయాన్ని మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. రెఫర్ కేసులు కూడా చాలా వరకు తగ్గిస్తున్నాం. ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు ఆస్పత్రికి సంబంధించిన రిపోర్ట్ అందిస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు కొనసాగిస్తున్నాం.

- డాక్టర్ రంగారావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జీజీహెచ్, వనపర్తి

ఫోన్ కాల్స్‌తో బెంబేలు

- ఆశ చూపి, బ్యాంకు ఖాతా వివరాలు సేకరణ
- వినూత్న టెక్నాలజీని వినియోగిస్తున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు




జడ్చర్ల, జూన్ 27 : 'మేం ముంబై నుంచి సీబీఐ అధికారులం మాట్లాడుతున్నాం..మీ పేరుతో ఉన్న ఒక పార్శిల్‌లో డ్రగ్స్ లభించాయి. మీపై కేసు నమోదయ్యింది.. మీ ఆధార్‌కార్డు, బ్యాంకు వివరాలు పంపించాలి' అని జడ్చర్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు బెదిరించిన తీరు ఇలా ఉంది. కొంత సమయం తర్వాత మళ్లీ అదే వ్యక్తి ఫోన్ చేసి, ఉన్నత అధికారులతో మాట్లాడాను, పార్శిల్ క్యాన్సిల్ చేయిస్తా... అందుకు రూ.50 వేలు ఖర్చు అవుతుందని హుకుం జారీ చేశాడు. మరో 10 నిమిషాల వ్యవధిలో పార్సిల్ క్యాన్సిల్ చేయించాను డబ్బులు వెంటనే పంపించాలి, లేని పక్షంలో మేము వచ్చి అరెస్ట్ చేస్తామని భయపెట్టాడు. మరో 15 నిమిషాల అనంతరం మళ్లీ ఫోన్ చేసి అరెస్ట్ చేయడానికి వస్తున్నామంటూ బెదిరించాడు. ఈ విషయం ఎవరితో చెప్పుకున్నా.. తప్పు చేశావు కాబట్టే సీబీఐ అధికారులు నీకు ఫోన్ చేస్తున్నారని నిందిస్తారేమో అన్న భయంతో ఆ వ్యక్తి ఎవరికీ చెప్పుకోలేక పోయారు. మళ్లీ గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. కాస్త ధైర్యం తెచ్చుకొని తనపై నమోదైన కేసుకు సంబంధిం చిన ఎఫ్ఐఆర్ పంపించాలని, ఎఫ్ఐఆర్ కాపీ పంపించిన వెంటనే డబ్బులు పంపిస్తా అంటూ గట్టిగా చెప్పాడు. ఆ దెబ్బతో మళ్లీ ఫోన్ కాల్ రాలేదు.

మరో సంఘటనలో ఓ వ్యక్తికి ఓ సామాజిక మాధ్యమంలో ఓ మహిళ న్యూడ్ వీడియా కాల్ చేసింది. ఆ కాల్ అంతా రికార్డు చేసింది. ఆ వీడియోను తిరిగి ఆ వ్యక్తికి పంపించి, డబ్బులను డిమాండ్ చేసింది. డబ్బులను ఇవ్వని పక్షంలో వీడియోలను మీ కాంటాక్ట్ నెంబర్లన్నింటికి పంపిస్తా అంటూ బెదిరించింది. బెదిరిపోయిన ఆ వ్యక్తి విడతల వారీగా సుమారు రూ.70వేలు అతను చెప్పిన నెంబరుకు బదిలీ చేశాడు.

మేము బ్యాంకు ప్రధానకార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నాం... మీ క్రెడిట్ కార్డులో మరిన్ని వివరాలను నమోదు చేయాల్సి ఉంది... నమోదు చేసిన పక్షంలో మీకు రివార్డ్ వస్తాయి... మీకు లింక్‌ను పంపించాము, లింక్‌ను ఓపెన్ చేయండంటూ గుర్తు తెలియని వ్యక్తి చెప్పాడు. నిజమేనేమో అనుకుంటూ క్రెడిట్‌కార్డు వినియోగదారుడు లింక్‌ను ఓపెన్ చేశాడు. తన బ్యాంకు ఖాతాలో నుంచి రూ.96వేలు డ్రా కావడంతో మోసపోయానని గుర్తించాడు. జరిగిన సంఘ టనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇలాంటి కాల్స్ ఉమ్మడి జిల్లాలోని పలువురికి రోజూ వస్తూనే ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి మోసపోకుండా కొందరు అప్రమత్తం అవు తుండగా, మరికొందరు మోసపోతున్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వాళ్లు ఫోన్ చేసి బెదిరించినా, ఓటీపీలు అడిగినా ఇవ్వకూడదని పోలీసులు సూచిస్తున్నారు.

సైబర్ నేరం జరిగితే 1930కి ఫోన్ చేయాలి



గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు వస్తాయని ఆశపెడతారు. వాళ్లని నమ్మితే బ్యాం కు ఖాతాలో ఉన్న డబ్బులు పోతాయి. బ్యాంకు ఖాతాల వివరాలు, క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలను ఎట్టి పరిస్థితిల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దు. ఏదైనా సమాచారం ఇవ్వాల్సి ఉంటే నేరుగా బ్యాంకుకే వెళ్లి ఇవ్వాలి. కొన్ని సామాజిక మాధ్యమాలలో కొన్ని లింక్‌లను షేర్ చేసి, ఓపెన్ చేస్తే ఖాతాలో ఉన్న డబ్బులను కాజేస్తారు. ఫోన్ పక్కన ఫోన్ పెట్టి డేటాను బదిలీ చేసుకునే టెక్నాలజీతో సైబర్‌నేరగాళ్లు మోసం చేస్తున్నారు. పాస్‌వర్డ్‌లు, పిన్ నెంబర్లు స్ట్రాంగ్‌గా ఉండేవిధంగా పెట్టుకోవాలి. సోషల్ మీడియాలో ఆడపిల్లల ఫొటోలను డీపీలుగా పెట్ట వద్దు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నెంబరుకు కాల్‌చేసి పూర్తి వివరాలను నమోదు చేయాలి.

- ఆదిరెడ్డి, జడ్చర్ల సీఐ

రైతులకు టోకరా



పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

- మిరుప విత్తనాలు ఇస్తామంటూ నమ్మించిన వ్యాపారులు
- రెండు నెలలుగా అందుబాటులోకి రాని వ్యాపారులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

గట్టు, జూన్ 27 : రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇస్తామని నమ్మబలికారు. వీరిమాటలను నమ్మిన రైతులు అడ్వాన్స్‌గా నగదును ఫోన్‌పే ద్వారా వారికి పంపించారు. విత్తనాలు ఇచ్చిన తర్వాత మిగతా నగదు చెల్లించాలని ఎకరాకు రెండువేల చొప్పున లాగేశారు. తీరా విత్తనాల కోసం ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని తెలుసుకొని ఫోన్‌పే ద్వారా చెల్లించిన నంబరు, వారి ఫోన్ నంబర్లను ఆధారం చేసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడ్వాన్స్‌గా రూ. 50 లక్షలకు పైగానే వసూలు

విత్తనాలు అందిస్తామని అడ్వాన్స్‌గా గట్టు మండలంలోని రైతుల నుంచి దాదాపు రూ.50 లక్షలు వసూలు చేసుకున్నారు. చాగదోణ గ్రామానికి చెందిన రైతులు మిరప విత్తనాలు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విత్తన వ్యాపారులను సంప్రదించారు. ఎమ్మిగనూర్‌కు చెందిన గిడ్డయ్య, కర్ణాటకకు చెందిన వ్యాపారి గురుసాంబశివ ట్రేడర్స్ ద్వారా విత్తనాలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం రైతులు దాదాపు 150 ఎకరాలకు విత్తనాలు తీసుకోవడానికి ముందుకు వచ్చారు. అడ్వాన్స్‌గా ఎకరాకు రూ.వెయ్యి రూపాయల చొప్పున చెల్లించి మిగతా నగదును విత్తనాల ఇచ్చిన తర్వాత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. రెండు నెలల కిందట చాగదోణకు చెందిన 60 మంది రైతులు విత్తన వ్యాపారులకు ఫోన్‌పే అడ్వాన్స్ రూపాయలు పంపించారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు ఇలాగా అడ్వాన్స్ చెల్లించారు. దాదాపు అడ్వాన్స్ డబ్బులే రూ.50 లక్షలు రైతుల నుంచి వసూలు చేశారు. అంతవరకు రైతులతో నిత్యం టచ్‌లో ఉన్న వ్యాపారులు ఆ తరువాత ఫోన్‌లు చేస్తే ఎత్తక పోవడం, మేసేజ్‌లకు స్పందించక పోవడం, ఫోన్‌లు స్విచ్చాఫ్ రావడంతో రైతులకు అనుమానం వచ్చింది. ఫోన్‌పే నంబరులు కూడా వేర్వేరుగా వస్తున్న విషయాన్ని రైతులు ఆలస్యంగా తెలుసుకున్నారు.

ప్రైవేటు విత్తన వ్యాపారులను నమ్మొద్దు

రైతులకు గ్రామ గ్రామాన సదస్సులు పెట్టి అవగహన కల్పించాం. ప్రైవేట్ విత్తన వ్యాపారులతో విత్తనాలు కొనవద్దని సూచనలు చేశాము. వ్యాపారులు రైతులతో అడ్వాన్స్‌ల రూపంలో వసూళ్లు చేసిన విషయం తమ దృష్టికి రాలేదు. మా దృష్టికి వస్తే పరిశీలిస్తాం.

- హన్మంతురెడ్డి, మండల వ్యవసాయ అధికారి

అందుబాటులోకి రావడం లేదు



అడ్వాన్స్‌ల ఇవ్వకముందు ఫోన్‌లో మాట్లాడారు. అడ్వాన్స్‌లు చెల్లించిన తరువాత రెండు నెలల నుంచి అందుబాటులోకి రావడం లేదు. ఫోన్‌పే ద్వారా రూ.8వేలు వేశాను. గతేడాది వీరితోనే విత్తనాలు తీసుకొని మిరుప సాగు చేశాను. అదే నమ్మకంతో గ్రామంలో ఇతర రైతులను కూడా వారికి పరిచయం చేశాను. తీరా వ్యాపారులు ఇలా టోకరా పెట్టారు. మాతో పాటు అనేక మంది రైతులు లక్షల్లో అడ్వాన్స్‌లు చెల్లించారు.

- శేఖర్, చాగదోణ

నమ్మి అడ్వాన్స్ చెల్లించాము



మిరప విత్తనాలు ఇస్తామంటే వ్యాపారులను నమ్మి ఫోన్‌పే ద్వారా నగదు పంపాము. నా ఫోన్‌పే నుంచే దాదపు రూ.44 వేలను వ్యాపారికి పంపించాము. అడ్వాన్స్‌లు ఇచ్చే వరకు మాతో ఫోన్‌లు మాట్లాడారు. అడ్వాన్స్‌లు పంపిన తరువాత మా ఫోన్లు ఎత్తడం లేదు. మోస పోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించాము. అధికారులు స్పందించి వ్యాపారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలి.

- మౌలాలి, చాగదోణ

బావి తవ్వుతుండగా మట్టిలో కూరుకుపోయిన వ్యక్తి

హిటాచీతో నాలుగు గంటలు శ్రమించి శవం వెలికితీత

కేటీదొడ్డి, జూన్ 27 : బావి తవ్వుతుండగా పరిశీలించేందుకు లోనికి దిగిన వ్యక్తిపై మట్టిదిబ్బలు కూలిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇర్కిచేడు గ్రామానికి చెందిన రైతు జనార్దన్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలో నీళ్ల నిల్వ ఉంచేందుకు బావిని తవ్వుతున్నాడు. హిటాచీతో దాదాపు 30 ఫీట్ల లోతు వరకు తవ్వారు. ఇంకా తవ్వాలని హిటాచీ డ్రైవర్‌కు చెప్పగా, ఇంకాలోతు తీస్తే మట్టి పొర్లుతుందని వద్దని వారించాడు. అయితే బావి తవ్వకాన్ని చూడటానికి పక్క పొలానికి చెందిన జయరామ్ (30) అనే వ్యక్తిని పంపారు. ఆయన హిటాచీ బకెట్ సహాయంతో లోనికి దిగాడు. గడ్డపారతో గట్టిదనం పరిశీలిస్తుండగా ఒక్కసారిగా దరిదొర్లి నాలుగు వైపుల నుంచి ఒక్కసారిగా మట్టిదిబ్బలు ఆయనపై పడ్డాయి. దీంతో మట్టిలో కూరుకుపోయాడు. వెంటనే హిటాచీ సహాయంతో మట్టిని తీస్తుండగా మళ్లీ మళ్లీ మట్టిదిబ్బలు కూలి పడుతుండటంతో వాటిని తొలగించేందుకు నాలుగు గంటలు శ్రమించాల్సి వచ్చింది. అప్పటికే జయరామ్ మృతి చెందాడు. ఈ సంఘటన గ్రామంలో తెలియడంతో చూడటానికి పెద్ద సంఖ్యలో జనం అక్కడికి వచ్చారు. మృతుడికి భార్య అనుమంతమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.


జయరామ్ (ఫైల్)

విద్యుదాఘాతంతో ఆపరేటర్ మృతి

సబ్‌స్టేషన్‌లో ఫీడర్ స్విచ్ ఆఫ్ చేస్తుండగా ఘటన

గట్టు, జూన్ 27 : విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ ఆర్టిజన్ గ్రేడ్ 2 ఆపరేటర్ బొల్లెద్దుల లక్ష్మణ్ (49) విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఆలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం చోటుచేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కేటీ మల్లేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లక్ష్మణ్ విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో లోడ్ ఎక్కువైంది. కరెంటు త్రీఫేజ్ నుంచి సింగిల్ ఫేజ్‌కు మార్చాలని ఏఈ చిన్నయ్య చెప్పడంతో లక్ష్మణ్ బ్రేకర్‌ను ట్రిప్ చేయకుండా డైరెక్ట్‌గా పెంచికలపాడు ఫీడర్‌కు ఏబీ స్విచ్ ఆపరేట్ చేయడంతో ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన గద్వాలలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నాడు. భార్య ఆశ వర్కర్‌గా పని చేస్తున్నది. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవానికి గద్వాల ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.


లక్ష్మణ్ (ఫైల్)

ఆత్మకూరు కవికి తెలంగాణ సారస్వత పరిషత్ అవార్డు

రాచాలపల్లి బాబు దేవిదాస్‌రావును వరించిన అవార్డు

ఆత్మకూరు, జూన్ 27 : తెలుగు సంస్కృతి సాహిత్యంలోని వివిధ ప్రక్రియలో వెలువడిన ఉత్తమ గ్రంథాలకు ఈ ఏడాదికి గాను తెలంగాణ సారస్వత వరిష్ఠ పురస్కారాలను బుధవారం ప్రకటించింది. అందులో భాగంగా ఆత్మకూరు వాసి, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు బాబు దేవిదాస్ రావు శ్రీరామాయణో పనిషత్తు పద్య కవిత్వం సాహిత్య రూపంలో రాసినందుకు గాను తెలంగాణ సారస్వత పరిషత్ అవార్డు వరించింది. సంస్కృతి సాహిత్య రంగంలో విశేష కృషిచేస్తున్న ఆయనను ఎంపిక చేయడం గర్వకారణం అని పట్టణ ప్రముఖులు అంటున్నారు. వీరి పూర్వీకులు మహబూబ్ నగర్ జిల్లాలోని కల్వకుర్తి ప్రాంతంలో స్థిరపడ్డారు. కల్వకుర్తి పట్టణంలో పెరిగి పెద్దవాడైన బాబు దేవిదాస్ రావు 1969లో మొదటగా కల్వకుర్తిలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేశారు. 1970 నుంచి సాహిత్య రచన ప్రారంభించి పద్య, గద్య, వచన లలో తెలుగు సంస్కృతం, మరాఠీ, హిందీ మొదలగు భాషల్లో రచనలు చేసి ఉభయ రాష్ట్రాల్లో అనేక సత్కారాలు, సన్మానాలు పొందారు.

● ఆత్మకూరులో స్థిర నివాసం

రాచాలపల్లి బాబు దేవిదాస్‌రావు ఉద్యోగ రీత్యా ఆత్మకూరు సంస్థానం చేరినా ఆయన ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వీరి మాతృభాష మరాఠీ. అయినా తెలుగుభాషా పండితుడిగా, కవిగా పేరుగాంచారు. అంతేకాకుండా వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు ప్రభుత్వ జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించి 1986లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఎందరినో విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు చేర్చిన వారిలో ప్రముఖుడు. వేద శాస్త్ర రక్షణ పరిషత్తు ఉమ్మడి పాలమూరు జిల్లా కార్యదర్శిగా ఉండి 16 సభలు ఆత్మకూరు పట్టణంలోనే నిర్వహించి ఎందరో కవులకు ఆదర్శప్రాయుడయ్యారు. సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖులకు ప్రతీయేటా తెలంగాణ సారస్వత పరిషత్ వరిష్ఠ పురస్కారాలు అందిస్తోంది. అందులో భాగంగా ఈ సంవత్సరం మన ఆత్మకూరు పట్టణవాసి ఎంపికైనందుకు గాను పట్టణ ప్రముఖులు, విద్యావేత్తలు, కవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మరిన్ని సాహిత్య కళా సంపుటిలను అందించాలని ఆత్మకూరు పట్టణ ప్రముఖులు కోరుతున్నారు.


రాచాలపల్లి బాబు దేవిదాస్‌రావు

అమ్రాబాద్ అభయారణ్యం ఇన్‌చార్జి క్షేత్ర సంచాలకురాలిగా శివాని డోగ్రా

మన్ననూర్, జూన్ 27 : నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం(ఏటీఆర్) ఇన్‌చార్జి క్షేత్ర సంచాలకురాలు (ఎఫ్‌డీ)గా శివాని డోగ్రా గురువారం నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎఫ్‌డీగా కొంత కాలంగా పనిచేస్తున్న క్షితిజ సెలవుపై వెళ్లారు. యాదాద్రి జిల్లా అటవీ కన్జర్వేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శివాని డోగ్రా బదిలీపై అమ్రాబాద్ ఇన్‌చార్జి ఎఫ్‌డీగా ఇక్కడికి వచ్చారు. అటవీ శాఖలో బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి ఎఫ్‌డీ నియామకం జరగాల్సి ఉంది. ఇన్‌చార్జి ఎఫ్‌డీని జిల్లా జూనియర్ అటవీ అధికారుల యూనియన్ అధ్యక్షుడు రవి కుమార్ ఆధ్వర్యంలో గురువారం అధికారులు కలిసి బోకె ఇచ్చి స్వాగతం పలికారు. యూనియన్ ఉపాధ్యక్షుడు వాల్యా నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజీబ్ గోరి, జాయింట్ సెక్రటరీ రాంబాబు పాల్గొన్నారు.


శివాని డోగ్రాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అటవీ అధికారుల యూనియన్ సభ్యులు

మండల మహిళా సమాఖ్యకు నిధులు మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీరంగాపురం, జూన్ 27 : మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనానికి నిధులు మంజూరు చేయించినట్లు జడ్పీటీసీ సభ్యుడు ఎం.రాజేంద్రప్రసాద్‌యాదవ్ తెలిపారు. 'సమాఖ్య భవనం పూర్తయ్యేదెన్నడు..?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన వార్తా కథనానికి జడ్పీటీసీ సభ్యుడు స్పందించారు. గురువారం జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ద్వారా జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.12 లక్షలు మంజూరు చేయించారు. అంతేకాకుండా భవనానికి స్థల సేకరణ చేసి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితో భూమిపూజ చేయించారు.

కేంద్రియ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

జడ్చర్ల, జూన్ 27 : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన కేంద్రియ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారు. దేశస్థాయిలో 5వ స్థానంలో ఉన్న హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో హరికృష్ణ 8వ ర్యాంకు, భాస్కర్ 16వ ర్యాంకు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ తెలిపారు. విద్యార్థులను గురువారం కళాశాలలో అభినందించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

బల్మూరు, జూన్ 27 : మనస్తాపానికి ఉరి వేసుకుని యువకుడు నాగటి కిట్టు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం బాణాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు హైదరాబాద్‌లో సెంట్రింగ్ పని చేసే కార్మికుడు. అమ్మమ్మ మృతి చెందడంతో గ్రామానికి వచ్చి ఆమె దహన సంస్కారాలు నిర్వహించి అనంతరం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ఇందిరా తెలిపారు. మృతుడి తాతయ్య కుర్మయ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


యాదయ్య (ఫైల్)

రాజాపూర్, జూన్ 27 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామం పరిధిలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోట్ చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కుచ్చర్‌కల్ గ్రామానికి చెందిన యాదయ్య (45) షాద్‌నగర్‌లో కూరగాయల మార్కెట్‌లో హమాలీ పని చేస్తుంటాడు. గురువారం షాద్‌నగర్‌లో పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై రాజాపూర్‌కు వస్తుండగా మార్గమధ్యలోని రంగారెడ్డిగూడ గ్రామం దగ్గర లారీ ఢీ కొనడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించి, మృత దేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య మాలతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు : వ్యక్తి మృతి

జడ్చర్ల, జూన్ 27 : జడ్చర్ల మునిసిపాలిటీ బురెడ్డిపల్లి గేటు వద్ద ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. జడ్చర్ల ఎస్ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారు ప్రాంతానికి చెందిన ఆంజనేయులు (50) జడ్చర్ల కొత్తబస్టాండు సమీపంలోని ఓ హోటల్‌లో భోజనం చేయడానికి బుధవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా బురెడ్డిపల్లి గేటు వద్ద రాత్రి 11.30 నిమిషాల సమయంలో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయులు భార్య అరుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల కరపత్రం విడుదల

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 27 : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జూలై మాసంలో నిర్వహించనున్న ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల కరపత్రాలను గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచార్యులు ఆవిష్కరించారు. శ్రీవారి సేవకులు పాండురంగం, సురేష్ చందర్, చంద్రకళారెడ్డి, నిర్మలమ్మ, ప్రభావతమ్మ, హజిలాపురం భజనమండలి సభ్యులు నారాయణగౌడ్, చంద్రశేఖర్, నరింహులు మాతృమండలి సభ్యులు లక్ష్మీసింధు, సాధన, మంజుల, ఉమారాణి పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 27 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు మీద అవార్డు ఇచ్చేందుకు నిశ్చయించింది. చేనేత, డిజైనింగ్ వృత్తిలో నైపుణ్యం కలిగిన చేనేత కార్మికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు డి.బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, నారాయణపేట చీరలు, జనరల్ వెరైటీస్‌లలో చేనేత ఉత్పత్తి రకాలలో నైపుణ్యం కలిగి ఉండాలని, దరఖాస్తు దారులు చేనేత వృత్తిలో పదేళ్ల అనభవం, 30 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, డిజైనింగ్ లో ఐదేళ్ల అనుభవం, 25 సంవత్సరముల వయస్సు నిండి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు చేనేత, జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తును పొందవచ్చని సూచించారు. ఆ దరఖాస్తును జూలై 10వ తేదీలోపు కార్యాలయంలో సమర్పించాలని కోరారు. మరింత సమాచారానికి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, జూన్ 27 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని బావాజీపల్లిలో పసుపుల చెన్నయ్య(55) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామంలో భక్తుల బాలస్వామి ఇంటి దగ్గర కూలీ పని కోసం వెళ్లిన చెన్నయ్య బుధవారం నాలుగు గంటల సమయంలో కడుపు నొప్పితో బాధపడుతూ వైద్యం కోసం అదే గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ దగ్గరకు వెళ్లగా అప్పటికే చనిపోయినట్లు చెప్పారు. విషయం తెలిసిన భార్య కుమారునికి సమాచారం ఇవ్వగా, కుమారుడు గోవర్ధన్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బిజినెస్
మహబూబ్‌నగర్ ● శుక్రవారం 28 జూన్ 2024

సెన్సెక్స్79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

27% వరకు టారిఫ్‌ల పెంపు

జియో సేవలు మరింత ప్రియం

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొంది 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగుమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ ధైర్ఘ్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సెల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ..
ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం
» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన


సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు


సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలు పడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య
» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల
» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు
» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యూనివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నాళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలి

- జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్
- 30 లక్షల మొక్కలు నాటడం లక్ష్యమని స్పష్టం



మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్షిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 27 : జూలై మొదటి వారంలో వజ్రోత్సవ వనమహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. జిల్లాలో మొక్కలు నాటేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్ నగర్ పట్టణంలో కేసీఆర్ ఎకో పార్క్‌లో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వజ్రోత్సవ వన మహోత్సవం కార్యక్రమంలో 30 లక్షల 87 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపా రు. జిల్లాలోని నర్సరీలలో మొక్కల లభ్యతపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 441 గ్రామ పంచాయతీ నర్సరీలు, 9 అటవీశాఖ నర్సరీలు, మునిసిపాలిటీల్లో ఆరు నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఆర్‌డీవో నర్సింహులు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంటలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

చిన్నచింతకుంట, జూన్ 27 : మండల కేంద్రమైన చిన్నచింతకుంటలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో తహసీల్దార్, ఎంపీడీవో, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతోపాటు ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ల కార్యాలయాన్ని పరిశీలించారు. ధరణి రిజిస్ట్రేషన్లను పరిశీలించి, దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం, పీహెచ్‌సీని పరిశీలించారు. మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో అనిల్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనతికాలంలోనే విస్తరించిన సేవలు

- పాలమూరు కో ఆపరేటివ్ బ్యాంకు పాలకవర్గం ఎన్నిక
- పాలక మండలిని అభినందించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న పాలమూరు బ్యాంక్ కమిటీ సభ్యులు

మహబూబ్‌నగర్/ భూత్పూర్, జూన్ 27 : ఖాతాదారులకు మంచి సేవలు అందించి అనతి కాలంలోనే పాలమూరు కో-ఆపరేటివ్ బ్యాంకు మంచి పేరును సంపాదించుకుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య పాలమూరు కో-ఆపరేటివ్ బ్యాంక్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని వాసవిగార్డెన్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సద్గురు రామ్మోహన్‌స్వామి (కంబగిరి లక్ష్మీనర్సింహస్వామి ఉపాసకులు), మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో పాలమూరు కో-ఆపరేటివ్ బ్యాంక్‌గా వెలిసి ఖాతాదారులకు అనేక సేవలు అందిస్తుందని ఎమ్మెల్యే అభినందించారు. బ్యాంకును స్థాపించిన ఫౌండర్ తిమ్మయ్యగుప్తాను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బ్యాంకు పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. బ్యాంకు చైర్మన్‌గా కండ కుమారస్వామి ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు. వైస్ చైర్మన్లుగా గుండాల కృష్ణయ్య (షాద్‌నగర్), కలకండ సూర్యానారాయణ ఎన్నికయ్యారు. పాలక మండలి సభ్యులు సద్గురు రామ్మోహన్‌స్వామి చేతులమీదుగా ఆశీర్వచనాలు పొందుతూ, ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు, పుల్ల శ్రీనివాసులు, పాలదరి రామ్మోహన్, గుండ వెంకటేశ్వర్లు, రాగిరి తిరుపతయ్య ధర్మపురి కుమారస్వామి, కొకుంట్ల శేఖరయ్య, కూన తిరుపతయ్య, ప్రోగ్రాం చైర్మన్ పుల్ల శ్రీనివాస్, రాఘవేందర్‌గుప్త, రాచూరి రాజేందర్‌కుమార్, వెంకటలక్ష్మి, వివిధ గ్రామాల ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 27 : జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో శుక్రవారం జిల్లా స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయని, ప్రవేశాల కోసం 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు ఉండి, 2015 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య కాలంలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, హెచ్‌ఎం జారీ చేసిన 3వ తరగతి బోనఫైడ్, ఉత్తీర్ణత సాధించిన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫోటోలతో పోటీలకు హాజరుకావాలన్నారు. ఉదయం 8.30 గంటలకు రావాలని తెలిపారు.

జడ్చర్ల సిగ్నల్‌గడ్డ వద్ద ట్రాఫిక్ జామ్



జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో స్తంభించిన ట్రాఫిక్

జడ్చర్ల, జూన్ 27 : జడ్చర్ల మునిసిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో గురువారం సాయంత్రం ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు, పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 167వ జాతీయ రహదారి నిర్మాణం పనులు కొనసాగుతుండడంతో ఒక వైపు నుంచే రాకపోకలు సాగిస్తుండడంతో వాహనాలు పోటాపోటీగా ఎదురెదురుగా రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. అదే దారిలో వస్తున్న 108 అంబులెన్స్ సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. ట్రాఫిక్ కష్టాలు తీరేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మిడ్జిల్ ఎస్‌ఐగా జయప్రసాద్

మిడ్జిల్, జూన్ 27 : మిడ్జిల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా జయప్రసాద్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆనంద్ నారాయణపేట జిల్లాకు బదిలీ కాగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జయప్రసాద్ మిడ్జిల్ ఎస్‌ఐ గురువారం బాధ్యతలు చేపట్టారు. పలు గ్రామాలకు చెందిన యువజన సంఘాల నాయకులు, పలు పార్టీల నాయకులు ఎస్‌ఐని శాలువాలతో సన్మానించారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి : ఎస్‌ఐ విక్రం

నవాబ్‌పేట, జూన్ 27: మండలంలో శాంతి భద్రలకు విఘాతం కల్గకుండా ప్రజలందరు సహకరించాలని నూతన ఎస్‌ఐ విక్రం అన్నారు. గురువారం నవాబ్‌పేట ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రయ్య ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అజహర్, రాజశేఖర్, పుట్టి అంజయ్యకొండల్, శ్రీహరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ లీక్‌కు నిరసనగా ఢిల్లీలో ఆందోళన

అడ్డాకుల, జూన్ 27 : వైద్య విద్యకు సంబంధించిన నీట్‌లో పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఢిల్లీలో యువజన కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. యువజన కాంగ్రెస్ దేవరకద్ర నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శిథిల భవనాలు భద్రమేనా ?

- ముసురు వానలకు కూలితే..
- నష్టం జరగకముందే అధికారులు మేల్కోవాలి
- నివాసాల మధ్య ముళ్ల పొదల నుంచి పాముల సంచారం
- పురాతన భవనాలు, ముళ్ల పొదలను తొలగించాలి



జానంపల్లిలో శిథిలమై చెట్ల తీగలతో అల్లుకున్న ఇల్లు



పగిడ్యాల్ గ్రామంలో గతంలో ఇల్లు కూలి మృతిచెందిన తల్లీ ఇద్దరు పిల్లలు (ఫైల్)

గండీడ్, జూన్ 27 : వర్షాకాలంలో పురాతన ఇళ్లు, భవంతులు వానలకు తడిసి కూలుతుంటాయి. గ్రామాల్లో పాత ఇళ్లలో ఉంటున్న వారిని గుర్తించి, ఖాళీ చేయించి, వాటిని కూల్చివేయపోతే, ముసురు వానాలకు కూలితే ప్రాణనష్టం జరుగుతుంది. వర్షాకాలం ఆరంభంలో గ్రామాల్లో అధికారులు శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చడం, నివాసాల మధ్య ఖాళీగా వదిలేసిన ప్లాట్లలో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు, పొదలను తొలగించి శుభ్రం చేయించడం వంటి పనులు చేయించాలి.

మండలంలో రెండు మూడేళ్లుగా అధికారులు ఆ పనులు చేయడం లేదు. ప్రధానంగా గ్రామ కార్యదర్శులకు ఈ బాధ్యత ఉంటుంది. కొన్ని చోట్ల పురాతన ఇళ్లను కూల్చేందుకు సంబంధిత ఇళ్ల యజమానులు అంగీకరించక కూడా అలాగే వదిలేయాల్సి వస్తుంది. మండల పరిధిలో రంగారెడ్డిపల్లి, జానంపల్లి, బల్సుర్‌గొండ, గొల్లగడ్డ తదితర గ్రామాల్లో కూడా పాతబడిన ఇళ్లు అలాగే వదలడంతో వర్షాకాలంలో పాములు, క్రిమికీటకాలు వస్తున్నాయని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పాడుబడిన ఇళ్లల్లో ఏపుగా పెరిగిన ముళ్ల పొదల నుంచి పాములు, విష కీటకాలు ఒకే సారి ఐదు పది బయటికి వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మూడేళ్ల క్రితం మండల పరిధిలోని పగిడ్యాల్ గ్రామంలో భారీ వర్షానికి ఇల్లు కూలి తల్లితో పాటు ఇద్దరు బిడ్డలు మృతి చెందిన సంఘటన మండల ప్రజలను చలించివేసింది. తల్లి బలిజ శరణమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు భవాని, శ్రావణి ఇల్లు కూలిన ఘనలో మృతిచెందారు. దాంతో ఇప్పటికీ ఇంటి యజమాని మల్లప్ప దిగులతో ఉన్నాడు. అప్పట్లో మంత్రి శ్రీనివాస్ గౌడ్, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి వచ్చి పరామర్శించారు. కానీ, ఒంటివాడైన మల్లప్పకు ఇల్లు కట్టించి ఇవ్వలేదు. ఆర్థిక సాయం అంతకన్నా లేదు. అన్ని రిపోర్టులు తహసీల్దార్ కార్యాలయానికి అందించామని, ఇంత వరకు ఆర్థిక సహాయం అందక చిన్న డబ్బా పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. ఇలాంటి సంఘటనలు ఎవరికీ జరగకుండా అధికారులు గ్రామాల్లో చైతన్యం చేయాలని మల్లప్ప అంటున్నారు.

నోటీసులు ఇచ్చాం

గ్రామంలో పాతబడిన గృహాలు పూర్తిగా తొలగించాలని ఇంటి యజమానులకు గతంలో నోటీసులు ఇచ్చాము. పై అధికారులు వచ్చి చెప్పినా వారు సహకరించ లేదు. పాతబడిన గృహాల యజమానులతో, గ్రామ పెద్దలతో మాట్లాడి వెంటనే తొలగించే విధంగా కృషి చేస్తాం. వారం రోజుల్లో వాటిని తొలగించేం దుకు చర్యలు తీసుకుంటాం.

ఫాతిమా, గ్రామ కార్యదర్శి, జానంపల్లి

పాత గృహాలను తొలగించాలి

పాడుబడిన గృహాలను, పిచ్చి మొక్కలను తొలగించాలని యువకులు, గ్రామ స్థులం కలిసి అధికారులకు విన్నవించుకున్నాము. ప్రమాదాలు జరగకముందే వాటిని తొలగించాలి. అభం శుభం తెలియని పిల్లలు రోడ్లపై తిరుగుతూ ఆడుతుంటారు. విష పురుగుల వల్ల ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. పాత గృహాలను తొలగించాలి.

- శేఖర్ గౌడ్, జానంపల్లి

నోటీసులు ఇప్పించి తొలగిస్తాం

రెండు మూడేళ్లలో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పాతబడిన గృహాలను గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో తొలగించాం. కొన్ని గ్రామాల్లో పాత ఇళ్ల యజ మానులు కొందరు తిరస్కరించారు. గ్రామ కార్యదర్శుల ద్వారా పాత గృహాల యజమా నులకు నోటీసులు అందించి వెంటనే తొలగించేలా కృషి చేస్తాం.

- శంకర్‌నాయక్, ఎంపీవో

మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలి

- అధికారుల సమీక్షలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్, జూన్ 27 : పురపాలిక పరిధిలో ప్రజలు మన నుంచి ఆశించేది తాగునీరు, మెరుగైన పారిశుధ్యం, వీధిలైట్లు, ఈ కనీస అవసరాలని, వాటిని అందించాల్సిన బాధ్యత మనపై ఉందని మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. వార్డులకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి ఎక్కువగా ఇవే విజ్ఞప్తులు వస్తున్నాయన్నారు. తాగునీటి సమస్య ఎట్టి పరిస్థితుల్లో తలెత్తడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గురువారం మునిసిపల్ సమావేశ మందిరంలో పురపాలిక పరిధిలో పనిచేసే అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి లైన్‌మెన్‌లు తమ తీరును మార్చుకోవాలని హెచ్చరించారు. మీపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రజలు నీళ్ల విషయంలో అడిగినప్పుడు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని, అలా కాకుండా మర్యాదగా ప్రజలతో మాట్లాడాలని సూచించారు. నల్లా కనెక్షన్‌లు ఇచ్చినప్పుడు కూడా కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇకపై అలాంటివి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, వేసవిలో అన్ని వార్డులలో దాదాపు 100 వరకు బోర్లు వేసి మోటార్‌లు బిగించామని గుర్తుచేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని, బ్లీచింగ్ చేయడంతో పాటు ఫాగింగ్, స్ప్రే చేయాలన్నారు. ముందస్తుగా చర్యలు చేపట్టాలని పారిశుధ్య విభాగం అధికారులకు సూచించారు. ఇక వీధిదీపాలు పోయిన చోట వెంటనే బల్బులు అమర్చాలని, వర్షాకాలంలో స్తంభాలకు లైట్లు పడకుంటే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పురపాలికకు మంచి పేరు తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

● కృష్ణానగర్‌కాలనీలో సీసీరోడ్డు పనులు : పట్టణంలోని 22వ వార్డు కృష్ణానగర్‌లో సీసీరోడ్డు పనులను మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, కౌన్సిలర్ రక్షిత పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం దరఖాస్తుల నమోదు చేపట్టాలి

- జడ్పీ సీఈవో రాఘవేందర్ రావు



నవాబ్‌పేటలో వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో రాఘవేందర్ రావు

నవాబ్‌పేట, జూన్ 27 : గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం, గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను త్వరగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని జడ్పీ సీఈవో రాఘవేందర్ రావు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించి, వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఉపాధిహామీ, విద్య తదితర అంశాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల నమోదును పరిశీలించిన జడ్పీ సీఈవో

హన్వాడ : ప్రజాపాలన సవరణ దరఖాస్తుల నమోదును పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని జడ్పీ సీఈవో రాఘవేందర్ రావు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ అధికారులకు సూచించారు. గురువారం హన్వాడ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సవరణ దరఖాస్తుల నమోదు పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో యశోద, ఎంపీవో వెంకటరెడ్డి, కార్యాలయ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు అధికారులు, ఉపాధి సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ కృష్ణాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే కౌంటర్‌తో ఇక్కట్లు

మిడ్జిల్ : ప్రజాపాలన దరఖాస్తులు చేసుకునేందుకు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు. గురువారం మండల కేంద్రంలోని దరఖాస్తులు చేసుకునేందుకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారు. ఒకే కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ చేపడుతుండటంతో ప్రజలు బారులు తీరారు. నాలుగు రోజులుగా 250 వరకు దరఖాస్తులను ఎంట్రీ చేసినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ మరో కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

350 దరఖాస్తుల నమోదు

దేవరకద్ర : ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రానికి 200 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. జీరో కరెంటు బిల్లు, 500 గ్యాస్ సిలిండరు రాని వారు ఉంటే తమ దరఖాస్తులను, ప్రజాపాలన దరఖాస్తులను తీసుకొచ్చి ఎంపీడీవో కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఇవ్వాలని తెలిపారు.

పోలేపల్లి సెజ్ పరిశ్రమల్లో తనిఖీలు

- శ్యాంపిళ్లు తీసుకున్న కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు

జడ్చర్ల, జూన్ 27 : జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఫార్మ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్య కారక నీటితో పంటపొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రస్తుతం వర్షాకాలంలో మళ్లీ కాలుష్యం నీటిని పరిశ్రమల యాజమాన్యాలు వదులుతాయని, తమ పంట పొలాలు కాపాడి, న్యాయం చేయాలంటూ రాజాపూర్ మండలం రాయపల్లి గ్రామానికి చెందిన రైతు మాధవీలతతో పాటు మరికొందరు రైతులు ఈ నెల 24న జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఫార్మ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై పోరాడుతున్నామని, న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో వెంటనే సెజ్‌లో కాలుష్యంపై విచారణ చేపట్టి నివేదిక అందజేయాలంటూ ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ విద్యుల్లత, టీఎస్ఐఐసీ జనరల్ మేనేజర్ బాబురావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్, గ్రౌండ్‌వాటర్ హైడ్రాలజిస్ట్ హరీష్‌బాబులు గురువారం సెజ్‌లోని ఆమ్నీల్, ఎవర్టోజన్, హెల్త్ కేర్ 3 యూనిట్‌లను తనిఖీ చేసేందుకు వచ్చారు. ఆమ్నీల్ పరిశ్రమలో తనిఖీలు చేసేందుకు వచ్చిన అధికార బృందానికి పరిశ్రమ సెక్యూరిటీ గేట్లు సైతం తీయకపోవడంతో అరగంట పాటు అక్కడే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు. అనంతరం ఎవర్టోజెన్, హెల్త్‌కేర్ 3 యూనిట్‌లలో తనిఖీలు చేయగా, కెమిక ల్‌తో కూడిన నీళ్లు ఉండడాన్ని గుర్తించారు. అనంతరం రైతుల పంటపొలాలను పరిశీలించారు. కాగా సెజ్‌కు నిర్మించిన ప్రహరీకి రంధ్రాలుండడం, ఆ రంధ్రాల ద్వారానే పంటపొలాలకు కాలుష్యం నీటిని వదులుతున్నట్లుగా అధికారులు గుర్తించారు. పంట పొలాల్లో ఉన్న బోర్లలోని నీటి నమూనాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరించారు. కలెక్టర్‌కు నివేదించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్ మానస, రాజాపూర్ ఏవో నరేందర్, ఏఈఓలు శారద, శ్రీనివాస్, రైతులున్నారు.

పీఎఫ్ సమస్యల పరిష్కారానికి అవగాహన

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 27 : పీఎఫ్ ఖాతాదారుల సమస్యలు పరిష్కరించేందుకే ప్రతీ నెల 27వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ పీఎఫ్ నోడల అధికారి ఈఓ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని ప్రావిడెంట్ ఫండ్ ఖాతాదారుల సమస్య లను నివృత్తి చేయడానికి గురువారం స్థానిక జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం కార్యాలయంలో నిర్వహించిన నిధి ఆప్కే నికాత్ 2.0 కార్యక్రమంలో ఆయన పీఎఫ్ ఖాతాదారుల సమస్యలను నివృత్తి చేశారు. 10 మందికి పైగా ఉద్యోగస్థులతో నిర్వహిస్తున్న ప్రతీ వ్యాపార వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసాగా తప్పనిసరి పీఎఫ్ ఖాతా సభ్యత్వం కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ క్లైయిమ్‌లను దాఖలు చేయడం సమస్యల హెల్ప్‌డెస్క్, ఫిర్యాదుల పరిష్కారం ఇక్కడే జరుగుతుందని, పరిష్కరించలేని సమస్యలను హైదరాబాద్ పీఎఫ్ ప్రధాన కార్యాలయంలో నమోదు చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గురువారం నిర్వహించిన క్యాంపులో ఖాతాదారుల అనేక సమస్యలను పరిష్కరించామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, బుచ్చన్న, లలిత, వెంకటయ్య, పీఎఫ్ సీనియర్ సెక్యూరిటీ అసిస్టెంట్లు శివకుమార్, దీపన్‌చక్రవర్తి, జిల్లా ఈఎస్ఐసీ బ్రాంచ్ మేనేజర్ అరబ్ అనీస్, అసిస్టెంట్ ఎన్. అజిత్ పాల్గొన్నారు.

భూత్పూర్ జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్‌గా కేవీ సుగుణ శ్రీ

భూత్పూర్, జూన్ 27 : మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ శివారులో ఉన్న జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా కేవీ సుగుణశ్రీ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ కాంట్రాక్ట్ బేసిస్ మీద పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు బస్వరాజు ఇంటికి వెళ్లిపోయారు. విద్యార్థులకు మంచి విద్యతో పాటు హాస్టల్‌లో పౌష్టికాహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

కోయిలకొండ, జూన్ 27 : మండలంలోని గార్లపాడ్ గ్రామానికి చెందిన వేణుగోపాల్‌కు ఉన్నత వైద్య విద్య కోసం ఖాజీపూర్ నాయకులు బచ్చిరెడ్డి గురువారం రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. ఉన్నత చదువుల కోసం వేణుగోపాల్ ఇబ్బందులు పడుతుండగా విషయం తెలసుకొన్న బచ్చిరెడ్డి సహాయం చేశారు. ప్రతీ సంవత్సరం సహకారం అందిస్తానని భరోసాచ్చారు. వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను చేరి మండలానికి పేరు తేవాలని ఆకాంక్షించారు.

15 అడుగులకు చేరిన కోయిల్‌సాగర్ నీటిమట్టం

దేవరకద్ర, జూన్ 27 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రం నాటికి 15 అడుగులకు చేరిందని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. జూరాల నుంచి నీరు రావడంతో రోజు రోజుకు క్రమక్రమంగా నీటి మట్టం పెరుగుతోందని తెలిపారు. గురువారం సాయంత్రానికి 15 అడుగులకు చేరిందని తెలిపారు. ఇంకా 17.5 అడుగుల వచ్చి చేరితే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది.

చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్

మిడ్జిల్, జూన్ 27 : మండలంలోని బోయిన్‌పల్లి గ్రామంలోని ఈనెల 25వ తేదీన ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. బోయిన్‌పల్లి గ్రామంలోని చోరీ జరిగిన విషయం తెలుసుకొని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టగా అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు చోరీకి పాల్పడినట్లు గుర్తించి అతని వద్ద రెండున్నర తులాల బంగారం, రెండు తులాల వెండి వస్తువులను స్వాధీన పర్చుకొని వ్యక్తిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'దళితులపై దాడులను అరికట్టాలి'

పాలమూరు, జూన్ 27 : మహబూబ్‌నగర్ జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ కోరారు. గురువారం జిల్లా ఎస్పీ డి.జానకిని కలిసి దళితులపై జరుగుతున్న దాడులను వివరించినట్లు ఆయన తెలిపారు. దళితుల భూములు, గైరాన్ భూములను ఇతరులు కబ్జా చేయటం, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. అట్రాసిటీ కేసు నమోదైన వెంటనే బాధితులకు వచ్చే నష్టపరిహారం ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఎస్పీని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్, కార్యదర్శి కృష్ణ, రఘు పాల్గొన్నారు.

నేడు షా అబ్దుల్ రహమాన్ గంధోత్సవం

కోయిలకొండ, జూన్ 27 : జిల్లాలో ప్రసిద్ధి చెందిన కోయిలకొండలోని షా అబ్దుల్ రహమాన్ వడెన్న దర్గా గంధోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు సయ్యద్ శమీం తెలిపారు. రెండు రోజుల నుంచే దర్గా వద్ద గంధోత్సవాలు ప్రారంభమ య్యాయని వెల్లడించారు. సాయంత్రం సయ్యద్ జలాలొద్దీన్ తమ ఇంటి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధోత్సవం ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గండీడ్, జూన్ 27 : నేడు మండల పరిధిలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ అనంతరం 12.30 రంగారెడ్డి పల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు ప్రారంభం, 1గంటకు జానంపల్లి సీసీ రోడ్డు, 1.30 గంటలకు కష్టాపూర్‌లో సీసీ రోడ్డు, 2.30 గంటలకు గోవింద్‌పల్లి బీసీ కమ్యూనిటీ హాల్, బీటీ రోడ్డును ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం 4 గంటలకు వెన్నాచేడ్ సాయిరాం ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం ఉంటుందని, ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెంట్రల్ యూనివర్సిటీ వీసీని సస్పెండ్ చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన



తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 27 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌరస్తాలో వీసీ బీజేరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ యూనివర్సిటీలలో విద్యార్థులకు సమస్యలు వస్తే నిరసన చేయడం నేరమా అన్నారు. నిరసన చేస్తే విద్యార్థుల జీవితాలను అంతం చేస్తా అని బెదిరించడంపై మండిపడ్డారు. విద్యార్థులను బెదిరింపులకు గురిచేస్తున్న వీసీపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న వీసీని వెంటనే సస్పెండ్ చేయాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు భగవత్, నందు, సాయి, మణికంఠ, దస్తప్ప పాల్గొన్నారు.

రహదారి పొడవునా డ్రైనేజీ ఏర్పాటుకు సన్నాహాలు



భూత్పూర్ దగ్గర పాలమూరు రోడ్డు పక్కన ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ కాలువ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భూత్పూర్, జూన్ 27: భూత్పూర్ పట్టణ కేంద్రం నుంచి వెలువడే మురుగు నీటిని బయటికి పారదోలేందుకుగాను పాలమూరు జాతీయ రహదారి రోడ్డు పక్కన రెండు కిలో మీటర్ల వరకు డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయనున్నట్లు హైవే అథార్టీ డీఈఈ రమేష్ చెప్పారు. గురువారం ఆయనతో పాటు నీటి పారుదల శాఖ డీఈఈ సిద్ధిఖీ, అధికారులు డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టే స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హైవే అథార్టీ అధికారి రమేష్ స్థానిక పాత్రికేయులతో మాట్లాడారు. చాలా కాలంగా భూత్పూర్ పట్టణంలో వేదిస్తున్న మెయిన్ డ్రైనేజీ కాలువ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్న ఆలోచనతో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.